క్లుప్తంగా

గుమ్మడి నర్సయ్యకు 'జేపీ' అవార్డు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేపీఎన్‌సీఈ ఆధ్వర్యంలో ఇచ్చే జయప్రకాశ్ నారాయణ స్మారక పురస్కారం–2025ను ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యకు ప్రదానం చేశారు. ఈ మేరకు కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ రవికుమార్ మాట్లాడుతూ.. నర్సయ్యకు అవార్డును ప్రదానం చేయడం గొప్ప విషయంగా భావిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. జేపీఎన్‌సీఈ విద్యార్థులు ప్రతిభావంతులుగా మారి, దేశం, ప్రపంచానికి సేవచేయాలని కోరారు. నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ.. రాజకీయ నాయకుడు గుమ్మడి నర్సయ్యను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కిల్లేగోపాల్, హన్మేశ్, వెంకటేశ్, కళాశాల కార్యదర్శి వెంకటరామారావు, ప్రిన్సిపాళ్లు కృష్ణమూర్తి, చంద్రశేఖర్, కంట్రోలర్ సందీప్ పాల్గొన్నారు.

జీపీగా కొనసాగించాలి

జడ్చర్ల టౌన్: మండలంలోని శంకరాయపల్లి తండాను గ్రామ పంచాయతీ కొనసాగించాలని తండావాసులు సోమవారం ఎంపీడీఓ విజయ్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. తండా పంచాయతీల ఏర్పాటులో భాగంగా శంకరాయపల్లితో కలిపి శంకరాయపల్లి తండాను జీపీగా ప్రకటించారని.. అయితే అధికారుల తప్పిదం, నిర్లక్ష్యం కారణంగా శంకరాయపల్లి తండాను మున్సిపాలిటీలో విలీనం చేసినట్లు పేర్కొన్నారు. విలీనం అయ్యాక తండావాసులు ఎన్నికలు బహిష్కరించామని గుర్తుచేశారు. శంకరాయపల్లిని శంకరాయపల్లి తండా జీపీగా గుర్తించరాదని విన్నవించారు. కార్యక్రమంలో తండావాసులు పాల్గొన్నారు.

జాతీయ కిక్‌బాక్సింగ్‌కు పాలమూరు క్రీడాకారులు



మహబూబ్‌నగర్ క్రీడలు: చెన్నైలో ఈనెల 27 నుంచి 31 వరకు జరిగే జాతీయస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు వెళుతున్నట్లు జిల్లా స్పోర్ట్స్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కె.రవికుమార్ తెలిపారు. క్రీడాకారులు మంగళవారం చెన్నైకు బయలుదేరుతున్నట్లు తెలిపారు. గత నెలలో మహబూబ్‌నగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ పాటించి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. జూనియర్ విభాగంలో నిర్వహిస్తున్న పోటీల్లో ఓంకార్, శివప్రసాద్, రేవంత్ తలపడుతున్నారు. 10 ఏళ్ల నుంచి 15 ఏళ్లలోపు విభాగంలో పాయింట్ ఫైట్, మ్యూజికల్ ఫామ్‌లో పోటీలు ఉంటాయని తెలిపారు. జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభచాటి పతకాలు సాధించాలని రవికుమార్ ఆకాంక్షించారు.

నక్ష బాటను పునరుద్ధరించాలి

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రం నుంచి అచ్చాయపల్లి మీదుగా చక్రాపూర్ వరకు పురాతన కాలం నుంచి ఉన్న నక్ష బాటను పునరుద్ధరించాలని అచ్చాయపల్లి గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ రాజునాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కృష్ణయ్య, ఆంజనేయులు, నాగయ్య, కాశన్న, బాలకిష్టయ్య, వెంకటయ్య, కుర్మయ్య తదితరులు ఉన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇంటి స్థలాలు కోల్పోయిన నిరుపేద కుటుంబాలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర నాయకురాలు జయలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణంలోని క్రిష్టియన్‌పల్లి సర్వేనెంబర్ 523 లో పట్టాలు కోల్పోయిన ప్రతి పేదకు డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థలం లేనివారికి 120 గజాల ఇంటిస్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ విజయేందిర బోయికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి చంద్రకాంత్, జిల్లా కమిటీ సభ్యుడు మోహన్, నాయకులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో ఆదివారం జరిగిన నేషనల్ కరాటే పోటీల్లో జిల్లా కేంద్రంలోని పద్మావతీ కాలనీకి చెందిన లిటిల్ ఏంజిల్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు డ్రాగన్ షోటోకాన్ మహబూబ్‌నగర్ అర్బన్ అధ్యక్షుడు, కరాటే మాస్టర్ ఎస్‌కే. మోసీన్ తెలిపారు. ఈ పోటీల్లో నవ్య, రామేశ్వరి, సాయి చరణ్, గణేశ్, శివ, రితీశ్ బంగారు పతకాలు, గీతిక, స్వాతి రజత పతకాలు, లావణ్య, సంజ కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు.

మట్టి ప్రతిమలు.. పర్యావరణహితం



ఉద్యోగులకు మట్టి వినాయకులు అందజేస్తున్న కలెక్టర్ విజయేందిరబోయి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో వినాయక చవితిని పురస్కరించుకొని ఉద్యోగులకు మట్టి గణపతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత కోసం మట్టి విగ్రహాలను ప్రతిష్టించాలనే ఉద్దేశంతో కాలుష్య నియంత్రణ మండలి ఉచితంగా మట్టి వినాయకులను అందజేస్తుందన్నారు. పీఓపీ, ఇతర రసాయనిక రంగులతో తయారు చేసిన విగ్రహాల కారణంగా జల వనరులు కాలుష్యం అవుతాయన్నారు. ప్రజలందరు మట్టి గణపజతులను ప్రతిష్టించి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని ఆకాంక్షించారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

సీజనల్ వ్యాధులు, డెంగీ ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాని కలెక్టర్ విజయేందిర అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పీఆర్, మున్సిపల్ శాఖలు వైద్య, ఆరోగ్య శాఖ సమన్వయంతో పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కువగా డెంగీ కేసులు నమోదు కాకండా ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇళ్లలో నీళ్ల నిలువ ఉండకుండా చూసుకోవాలని, నీళ్ల నిల్వ వల్ల దోమలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రైవే పాటించాలన్నారు. పరిసరాల్లో నీరు నిల్వ లేకుండాచూడాలన్నారు. నీళ్లలో దోమ లు గుడ్డుపెట్టే లార్వా, దోమ పెరిగేందుకు వారం రోజులు పడుతుందని అందకే దోమలు నివారణకు ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్ఓ శశికాంత్ పాల్గొన్నారు.

మట్టి గణపతులు పంపిణీ

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో కలం స్నేహం సంగీత, సాహిత్య, సామాజిక సేవాసంస్థ మహబూబ్‌నగర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాసంస్థ కార్యాలయంలో అధ్యక్షురాలు మేకల అనురాధ మట్టి గణపతుల విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, కలం స్నేహం జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతారెడ్డి, రావూరి వనజ పాల్గొన్నారు.

స్పందించారు.. పరిశీలించారు

సాక్షి ఎఫెక్ట్..



సెల్లార్ వద్ద పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేశ్

జడ్చర్ల టౌన్: జడ్చర్ల మున్సిపాలిటీ 4వ వార్డు వెంకటేశ్వర కాలనీలో 'విజృంభిస్తున్న డెంగీ' శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేశ్ బృందం అసంపూర్తి నిర్మాణంలో ఉన్న సెల్లార్‌ను పరిశీలించారు. వెంటనే మూసి వేసేందుకు చర్యలు తీసుకోవాలని భవన యజమానులను ఆదేశించారు. వెంటనే నీటిని తొలగింపజేయాలని సూచించారు. భవనం చుట్టూ పిచ్చి మొక్కలు తొలగింపజేసి బ్లీచింగ్‌పౌడర్ చల్లించారు. సెల్లార్‌లో ఉన్న నిల్వనీటిలో లార్వా వృద్ధి చెందకుండా చర్యలు తీసుకున్నారు. కాలనీలో జ్వరాలబారిన పడినవారి వివరాలు సేకరించారు. కాగా భవన యజమానులు సెల్లార్‌లో మంగళవారం నీటిని తీసివేసి నీరు నిల్వ ఉండకుండా వాల్ నిర్మాణం చేపడతామని మున్సిపల్ అధికారులకు తెలియజేశారు.

'ప్రజావాణి' ఫిర్యాదులను పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలోని వివిధ డివిజన్లలో నెలకొన్న సమస్యలపై ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజావాణి'కి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం సాయంత్రం కమిషనర్ చాంబర్‌లో టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా పారిశుద్ధ్యంతోపాటు సీసీరోడ్లు, డ్రెయినేజీలు, వీధిదీపాల ఏర్పాటుపై నేరుగా కలెక్టర్ విజయేందిర బోయికి నగర ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. వీటన్నింటినీ క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. సమావేశంలో మేనేజర్ వెంకటేశ్వరరావు, ఏసీపీ కరుణాకర్‌గౌడ్, ఎంఈ బస్వరాజ్, డీఈఈలు నర్సింహ, హేమలత, ఏఈలు, టీపీబీఓలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

పాలమూరు: మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ సమక్షంలో సోమవారం పట్టణంలోని పద్మావతి కాలనీ ఎంపీ క్యాంపు కార్యాలయంలో నర్వ, ఉందెకోడ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారందరికి ఎంపీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ మంత్రి ఇలాఖాలో నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ వైపు వచ్చారని, స్థానిక సంస్థల ఎన్నికల వేళ పాలమూరులో బీజేపీ బలపడుతుందన్నారు.

ఆలయాలను దర్శించుకొన్న తనికెళ్ల భరణి



కోనేరు వద్ద మాట్లాడుతున్న తనికెళ్ల భరణి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మన్నెంకొండలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామిని సినీ నటుడు, రచయిత తనికెళ్ల భరణి సోమవారం దర్శించుకున్నారు. అనంతరం అక్కడి కోనేరు చరిత్రను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అలహరి మధుసూదన్‌కుమార్‌తో అడిగి తెలుసుకున్నారు. కాగా, సమీపంలో హనుమద్దాసుల విగ్రహాన్ని నిర్మించి భక్తులకు ఈ ప్రాంత చరిత్రను తెలియజేయాలనే తలంపుతో ఉన్నట్లు వివరించారు. జిల్లా కేంద్రంలోని అంబాభవాని ఆలయంలో సోమవారం రాత్రి సినీ నటుడు, రచయిత తనికెళ్ల భరణి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆయనకు పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి వస్త్రాలను బహూకరించారు. ఆయా కార్యక్రమాల్లో జేపీఎన్‌సీఈ చైర్మన్ కేఎస్ రవికుమార్, పట్టణ వీరశైవ లింగాయత్ లింగ బలిజ నాయకులు వజ్రలింగం, మల్లేష, శంకర్‌లింగం, ఉమేష్ కుమార్, పోకల శివుడు, ఎ.రాజసింహుడు, రామలింగం పాల్గొన్నారు.

బీసీల ఆరాధ్యుడు బీపీ మండల్



స్టేషన్(మహబూబ్‌నగర్): బీసీల ఆరాధ్యుడు బీపీ మండల్ అని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్సాగర్ అన్నారు. బీపీ మండల్ జయంతి సందర్భంగా బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్, జిల్లా ప్రచార కార్యదర్శి సుకుమార్, ఎంబీసీ నాయకుడు శేఖరాచారి, జాండ్ర సంఘం మాజీ అధ్యక్షుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన మేళా



ఆకట్టుకున్న విద్యార్థుల ప్రత్యేక అలంకరణ బోధన

నవాబుపేట: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో హెచ్ఎం నాగ్యానాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన టీఎల్ఎం విజ్ఞానమేళా ఆకట్టుకుంది. మండలం మొత్తం 78పాఠశాలల విద్యార్థులు తయారు చేసి తీసుకొచ్చిన ప్రయోగాలను ప్రదర్శించారు. వీటిలో సులువుగా గణితం, రోబోతో పాఠాలు, తెలుగు వర్ణమాలలు, వివిధ రకాల ఆహార పదార్థాలు వల్ల మనుషులకు మేలు జరిగే విషయాలపై ఏర్పాటు చేసిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు వివిధ రకాల ప్రయోగాల తయారీలో శిక్షణ ఇచ్చి మేళాను పెద్దఎత్తున నిర్వహించడంపై ఉపాధ్యాయ బృందాలను సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లింగం అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్, ఎంఈఓ నాగ్యానాయక్, ఉపాధ్యాయ సంఘం నాయకులు దశరథ్ నాయక్, రాములు, రవిశంకర్, యాదయ్య, విజయ్, మల్లికార్జున్, జహీర్‌అక్తర్, వెంకటేశ్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి టోర్నీ పరిశీలకుడిగా పీడీ వడెన్న

మహబూబ్‌నగర్ క్రీడలు: రంగారెడ్డి జిల్లా ఇబ్రాహీంపట్నంలో సోమవారం ప్రారంభమైన ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ అండర్–17 పోటీల బాలుర విభాగానికి జడ్చర్ల పట్టణం బాదేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వడెన్న పరిశీలకుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఉషారాణి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వడెన్న నియామకంపై జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి హర్షం వ్యక్తం చేశారు.


6నుంచి స్మారక టోర్నీ

జడ్చర్ల టౌన్: మాజీమంత్రి లక్ష్మారెడ్డి సతీమణి స్వర్గీయ డా.శ్వేత ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని సెప్టెంబర్ 6నుంచి 3రోజులపాటు రాష్ట్రస్థాయి మహిళల వాలీబాల్ టోర్నీ నిర్వహించనున్నట్లు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్ యాదయ్య తెలిపారు. సోమవారం జడ్చర్లలోని లక్ష్మారెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. శ్వేత ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి టోర్నీకి రాష్ట్రంలోని నలుమూలల నుంచి పేరుగాంచిన ఉమెన్స్ వాలీబాల్ జట్లు రానున్నాయని వెల్లడించారు. బహుమతితోపాటు షీల్డులు, మెడల్స్ అందజేస్తామన్నారు. టోర్నీ నిర్వహణను బీఆర్ఎస్ నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

కాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్

నియోజకవర్గంలోని బాలానగర్, రాజాపూర్, కావేరమ్మపేట, బాదేపల్లి, మిడ్జిల్, నవాబుపేటలో కాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలు ఉచితంగా స్క్రీనింగ్ చేయించుకోవాలని కోరారు. శిబిరం నిర్వహణ తేదీలను రెండు రోజుల్లో వెల్లడిస్తామన్నారు. అనంతరం వాలీబాల్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకుడు మురళి, వార్డు కౌన్సిలర్ చైతన్య, రామ్మోహన్, ప్రణీల్‌చందర్, రఘుపతిరెడ్డి, శ్రీశైలం యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

యూరియా కొరతపై బీఆర్ఎస్ ధర్నా



దేవరకద్ర: యూరియా కొరతకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపిస్తూ సోమవారం బీఆర్ఎస్ నాయకులు కౌకుంట్ల మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పదేళ్లలో యూరియా కొరత రాలేదని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకా యూరియా కొరత ఏర్పడిందని నాయకులు ఆరోపించారు. రైతులకు ఇబ్బంది లేకుండా యూరియాను అందించాలని కోరుతూ మండల వ్యవసాయ అధికారికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కేబీఆర్‌గౌడ్, శివరాజు, కృష్ణయ్య, జాంగీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లి శివారులోని దుందుభీ వాగు నుంచి సోమవారం అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. అక్రమ ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సంక్షిప్తంగా

షాపింగ్ కాంప్లెక్స్‌కు రీటెండర్ వేయాలి

జడ్చర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 167 నంబర్ జాతీయ రహదారిని అనుసరించి కొనసాగుతున్న షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు రీటెండర్ వేయాలని కోరుతూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ నర్సింగరావుకు ఫిర్యాదు చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య మాట్లాడుతూ.. 20ఏళ్ల కిందట టెండర్లు నిర్వహించి దుకాణాలను అప్పగించారని ఇప్పటివరకు తిరిగి టెండర్లు నిర్వహించలేదన్నారు. దుకాణాలను దక్కించుకున్న వారు ప్రభుత్వానికి తక్కువ అద్దె చెల్లిస్తూ ఇతరులకు ఎక్కువ అద్దెకు ఇచ్చారని తెలిపారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి రీటెండర్లు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, రాము, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

'దళితులపై చిన్నచూపు తగదు'

చిన్నచింతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం దళితులపై చిన్నచూపు చూస్తుందని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కావలి ఆంజనేయులు, ఎస్సీ మోర్చా మండల ఉపాధ్యక్షుడు హనుమంతు ఆరోపించారు. దళితులకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపట్టడంలేదని ఆరోపిస్తు సోమవారం లాల్‌కోట జీపీ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో దళితులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి రాజుకు వినతి పత్రం అందజేశారు. లాల్‌కోటలో నిరుపేదలై ఉండి ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ అధికారులు దళితులకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూములుండి అన్నివిధాలుగా ఆర్థికంగా ఉన్నవారికే ఇళ్లను కట్టబెడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో భువనేశ్, వెంకటేశ్, రాము, మోహన్, ఆంజనేయులు, కురు మప్ప, రామాంజనేయులు, సురేశ్, బాలప్ప, జైపాల్, వెంకటేశ్, బాలరాజు ఉన్నారు.


44 మందికి ఉద్యోగావకాశాలు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్ మేళా విజయవంతమైంది. అరబిందో ఫార్మ కంపెనీలో పనిచేసేందుకు ఎస్ఎస్‌వీ సొల్యూషన్స్ కంపెనీ, కళాశాల కెరీర్ గైడెన్స్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహించగా.. వివిధ ప్రాంతాల నుంచి 100 మంది హాజరయ్యారు. వీరిలో 44 మంది ఇంటర్వ్యూల ద్వారా ఎంపికవగా.. జడ్చర్ల, హైదరాబాద్ ఫార్మ కంపెనీల్లో ఒక చోట అవకాశం కల్పించనున్నారు. కార్యక్రమంలో అరబిందో మేనేజింగ్ డైరెక్టర్ స్వరూప్, ప్రిన్సిపాల్ సుకన్య, ప్లేస్‌మెంట్ అధికారి రాఘవేంద్రరెడ్డి, ఫార్మ కంపెనీ హెచ్ఆర్ హృషికేశ, ఎస్ఎస్‌వీ సొల్యూషన్స్ కంపెనీ ప్రభాకర్, ఎగ్జిక్యూటీవ్ మేనేజర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రేన్స్, సీడ్స్ మర్చంట్స్ సంఘం ఎన్నిక

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ గ్రేన్స్, సీడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం స్థానిక కార్యాలయంలో ఎన్నున్నారు. అధ్యక్షుడిగా అశోక్‌కుమార్, ఉపాధ్యక్షులుగా సతీశ్‌కుమార్, సూదిరాము, ప్రధాన కార్యదర్శిగా తిరుపతయ్య, సహాయ కార్యదర్శులుగా సంతోష్‌కుమార్, వెంకటయ్య, కోశాధికారిగా వినోద్‌కుమార్‌తోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కమిటీ 2028 వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సురేశ్‌కుమార్, కుమారస్వామి పాల్గొన్నారు.

పెండింగ్ కమీషన్ విడుదల చేయాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం నుంచి రేషన్ డీలర్లకు రావాల్సిన పెండింగ్ కమీషన్ వెంటనే విడుదల చేయాలని జిల్లా చౌకధర దుకాణదారుల సంక్షేమం సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. 2024నుంచి రేషన్ డీలర్లకు కమీషన్ డబ్బులు రాలేదని, కమీషన్ ఫైలును రాష్ట్ర కమిషనర్ ఆమోదింపజేయాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జానకిరాములు, కోశాధికారి నర్సింహులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పనిభారాన్ని తగ్గించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కార్మికుల పనిభారాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్ డిమాండ్ చేశారు. సోమవారం జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రంగా అజ్మీరాకు కార్మికుల ఆధ్వర్యంలో సన్మానం చేసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పారిశుద్ధ్య, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ల విభాగాల్లోని కార్మికులు పనిభారంతో ఇబ్బందులు పడుతున్నారని, కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చెన్నయ్య, రంగయ్య, అంజి, రామకృష్ణ, యాదయ్య, మన్యం పాల్గొన్నారు.



దేవరకద్ర అభివృద్ధే లక్ష్యం



సర్వీసు రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: దేవరకద్ర అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం మున్సిపాలిటీలో రాయిచూర్ రోడ్, మహబూబ్‌నగర్ రోడ్‌లో రూ.కోటి10లక్షలతో చేపట్టే సర్వీసు రోడ్ల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సర్వీసు రోడ్లు పూర్తయితే పట్టణం మరింత అభివృద్ధిలోకి వస్తుందన్నారు. యూరియా కొరతకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. తెలంగాణకు రావాల్సిన యూరియా కోటాను కేటాయించకుండా రైతుల ఉసురు పోసుకుంటుందని విమర్శించారు. కార్యక్రమంలో కమిషనర్ నరేశ్‌బాబు, ఈఓ సీత్యానాయక్, మార్కెట్ చైర్మన్ కతలప్ప, దేవస్థాన కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు నోటీసులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని క్లబ్‌రోడ్డులో ఉన్న అన్నపూర్ణ (కిడ్నీ) డయాగ్నోస్టిక్ సెంటర్‌లో తప్పుడు రిపోర్ట్‌లు ఇచ్చినందుకు వివరణ ఇవ్వాలంటూ అదనపు డీఎంహెచ్ఓ పద్మజ సోమవారం నోటీసులు జారీచేశారు. సోమవారం ఆమె సెంటర్‌ను సందర్శించి తప్పుడు రిపోర్టులపై విచారణ చేపట్టారు. మిడ్జిల్ మండలానికి చెందిన ఓ వ్యక్తి శనివారం షుగర్ టెస్టులు చేసుకున్నాడు. అయితే ఆ రిపోర్టులను తీసుకుని మరో ఆస్పత్రికి వెళ్లగా.. హైలెవల్స్ ఉన్నాయని నిర్ధారించారు. మరోసారి పరీక్ష చేసుకోవాలని సూచించారు. స్పందించిన సదరు వ్యక్తి డయాగ్నోస్టిక్ సెంటర్‌పై ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ చేశారు. కంప్యూటర్ ఆపరేటర్ లేకనే వేరే వ్యక్తి రిపోర్టు ఇవ్వడంతో తప్పుగా ఇచ్చినట్లు సెంటర్ నిర్వాహకులు నిర్ధారించారు. మరోసారి ఇలాంటి రిపోర్టులు ఇస్తే కఠిన చర్యలు ఉంటాయని నిర్వాహకులను హెచ్చరించారు. జరిగిన తప్పిదానికి వివరణ ఇవ్వాలంటూ నోటీసు జారీ చేశారు.

శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు



నవాబుపేట: మండలంలో శ్రీకృష్ణుడి విగ్రహం ఊరే గింపు ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఊరేగింపులో ఆటపాటలు అందరినీ అలరించాయి. సోమవారం మండలంలోని కొల్లూర్, చౌడూరులో త్రైతసిద్ధాంత సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీకృష్ణుడి జయంతి ఉత్సవాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. త్రైతసిద్ధాంత సంఘం ఆధ్వర్యంలో వారం రోజులు శ్రీకృష్ణ జయంతి ఉత్సవాలు కొనసాగుతూనే ఉన్నాయి. కార్యక్రమాల్లో నాగ్యనాయక్, వెంకటయ్య, శ్రీనువాస్, బుచ్చిలింగం, కృష్ణయ్య, ఆంజనేయులు, అజయ్, పురుషోత్తం, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



నవాబుపేట: ప్రజాసమస్యలను గాలికొదిలేసి తప్పించుకునే కార్యక్రమాలకు అధికార పార్టీ లేవనెత్తిందని బీజేపీ జిల్లా నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, యాదయ్య ఆరోపించారు. సోమ వారం మండల కేంద్రంలో పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ అధ్యక్షతన తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొని ప్రసంగించారు. ఎన్నికల ముందు ప్రజలకు హామీలిచ్చి వాటిని విస్మరించిన కాంగ్రెస్ సర్కార్ స్థానిక ఎన్నికల నిర్వహణకు జంకుతుందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ప్రజా వ్యతిరేకతను చవిచూసిందన్నారు. ప్రజలకిచ్చిన వాగ్దానాలు నేరవేర్చేవరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తూనే ఉంటామని వివరించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధానకార్యదర్శి గణేశ్, యూత్ అధ్యక్షుడు చంద్రప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులపై వివక్ష చూపడం తగదు



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విద్యుత్ శాఖలోని ఎస్ఈ పరిధిలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులపై వివక్ష చూపుతున్నారని తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆనందబాబు అన్నార. ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాఖలో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఉద్యోగులు తమ రికార్డు అసిస్టెంట్ ప్రమోషన్లకు అనేకసార్లు వినతి పత్రాలు సమర్పించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ప్రమోషన్లు ఇవ్వడంలో ఎస్ఈ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ ప్రమాదాలకు బాధ్యులుగా చేస్తూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల మీద చార్జ్‌షీట్లు, మెమోలు, షోకాజ్ నోటీసులిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. నారాయణపేట జిల్లా ఏర్ప డి మూడేళ్లవుతున్నా.. అక్కడికి కేటాయించిన ఉద్యోగులను రిలీవ్ చేయాలని ఉన్నతాధికారులు రెండుసార్లు ఆదేశించిన ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి బీచుపల్లి, రిజినల్ అధ్యక్షుడు నారాయణ నాయక్, నాయకులు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

'మాజీ మంత్రిపై కబ్జా ఆరోపణలు నిరూపించాలి'



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గత ప్రభుత్వంలో మంత్రిగా శ్రీనివాస్‌గౌడ్ కబ్జాలు, దౌర్జనాలు చేశారని విమర్శిస్తున్న అధికార కాంగ్రెస్ నాయకులు నిరూపించాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గణేశ్ సవాల్ చేశారు. సోమవారం బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. శ్రీనివాస్‌గౌడ్ అవినీతి చిట్టా ఉంది అనడమే తప్పా.. విప్పింది లేదు.. అవినీతి నిరూపించిందిలేదని విమర్శించారు. అధికార కాంగ్రెస్ నాయకులకు దమ్ముంటే అవినీతిని నిరూపించాలని డిమాండ్ చేశారు. ఎరువుల కోసం వచ్చి మూర్ఛపోయిన ఆంజనేయులుపై పట్టా భూమి ఉన్న విషయాన్ని తెలియక రిక్షా కార్మికుడని మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఆదిపత్య పోరు కొనసాగుతుందని బీఆర్ఎస్ జిల్లా సీనియర్ మైనార్టీ నాయకుడు ఇమ్రాన్ అన్నారు. శ్రీనివాస్‌గౌడ్ నాయకులుగా తయారు చేసిన వాళ్లు ఇప్పుడు ఆయనపై విమర్శలు చేయడం సరికానద్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నవకాంత్, ఒబేద్, సుధాకర్, సిద్ధిక్, అభిద్, సాధిక్, సతీశ్, నసీర్, అప్సర్ పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి

చిన్నచింతకుంట: గణేశ్ మండపాల నిర్వాహకులు పోలీస్‌వారి నిబంధనలు పాటించాలని ఎస్సై రామ్‌లాల్‌నాయక్ సూచించారు. సోమవారం సీసీ కుంట పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసుల అనుమతులు తీసుకోవాలన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ రూపొందించిన వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.